క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దొంగచింత గ్రామంలో నిర్వహించిన గోరి పూజా కార్యక్రమాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట గ్రామ పటేల్ కుమ్రా జుగాది రావు, రాహుల్, కాంగ్రెస్ నాయకులు, గ్రామపటేళ్లు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష

బజార్‌హత్నూర్: మండలంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్‌ల స్వీకరణ, విధివిధానాల గురించి చర్చించారు.

ప్రిన్సిపాల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న అనితసాబు

ఖానాపూర్: పట్టణంలోని కేరళ మోడల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ అనితసాబు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని కేరళ ప్రభుత్వం సాంస్కృతిక వ్యవహారాలశాఖ అంతర్జాతీయ అధ్యయన తీర్థయాత్ర కేంద్రం ఆధ్వర్యంలో తిరువనంతపురంలో ఈ అవార్డు అందజేశారు. కేరళకు చెందిన గ్రామస్వరాజ్ ఫౌండేషన్ ఎంపిక మేరకు ఈ అవార్డు అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు పరిశీలన



ఆస్పత్రి సిబ్బందితో తనిఖీ బృందం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పరిసరాలు, వైద్యసేవలు, సౌకర్యాలను అధ్యయనం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆస్పత్రి పరిశీలించి సమకూర్చాల్సిన వసతుల విషయమై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు బృందం డీన్ డాక్టర్ సుబోధ్ అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

‘బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్పాలి’



సారంగాపూర్‌లో సంతకాలు సేకరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, నాయకులు

సారంగపూర్: ఓటు చోరీకి పాల్పడే బీజేపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని బీరవెల్లి, మలక్‌చించోలి, సారంగాపూర్ గ్రామాల్లో ఓటు చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ దొంగ ఓట్లు చెలామణి చేస్తూ ఓటు చోరీకి పాల్పడుతుందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుపోటుగా అభివర్ణించారు. కార్యక్రమంలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఇన్‌చార్జి రాంభూపాల్, టీపీసీసీ కార్యదర్శి రాజేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ హాదీ, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి

దిలావర్‌పూర్: ప్రతిఒక్కరూ వ్యాయామం చేస్తూ.. మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని హైదరాబాద్‌లోని రామంతపూర్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌లాల్ అన్నారు. మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో గురడి రెడ్డికాపు సంఘ భవనంలో బుధవారం హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, ప్లేర్ ఉన్నత పాఠశాలలో సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన సూచనలు చేశారు. ఇందులో ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్, వైద్య బృందం రాంప్రసాద్, డీపీఎం శ్రవణ్‌కుమార్, నర్సారెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అందని వేతనాలు

- ఇబ్బంది పడుతున్న ఉపాధిహామీ కూలీలు
- రూ. 16 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెండింగ్



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: ఆర్థిక ఇబ్బందుల నుంచి కొంత ఉపశమనం పొందేందుకు, కుటుంబాన్ని పోషించుకునేందుకు గ్రామీణులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీ పనులకు వెళ్తుంటారు. అలాగే పండుగలకు ఆ కూలీ డబ్బులు పనికొస్తాయని ఆశ పెట్టుకుంటారు. కానీ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లినా కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. దీంతో పండుగ పూట సైతం పస్తులుండవాల్సిన దుస్థితి నెలకొంటుందని వాపోతున్నారు.

మండలంలో రూ. 18 లక్షల వరకు పెండింగ్

మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో 10,731 జాబ్‌కార్డులు, 21,274 మంది కూలీలు ఉన్నారు. అయితే 7,503 యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా ఇందులో 13,972 మంది కూలీలు రెగ్యులర్ కూలీ పనులకు వెళ్తుంటారు. వీరికి గత మూడు, నాలుగు నెలల నుంచి వేతనాలు రావడం లేదు. ఆయా కూలీలకు మండలంలో సుమారు రూ. 16 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు కూలీ డబ్బులు రావాల్సి ఉంది. చేసినా కూలీ పనికి సకాలంలో వేతనాలు రాకపోవడంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల భారీ వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు సైతం అంతంతా మాత్రంగానే ఉండడంతో కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో వేతనాలు అందేలా చూడాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

రాబోయేది దీపావళి పండుగ

మండలంలో అత్యధికంగా గిరిజన గ్రామాలు ఉండడంతో అత్యధికంగా గిరిజన కూలీలు ఉంటారు. అయితే ఆదివాసీ గిరిజనులు దీపావళి పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. వారికి కూలీ డబ్బులు ఎంతో అవసరముంటాయి. దసరా పండుగకు ఇవ్వన్నప్పటికీ దీపావళి పండుగకు కూలీ డబ్బులు వస్తే తమకు ఎంతో మేలు కలుగుతుందని కూలీలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా నిబంధనల ప్రకారం వారం, పదిహేను రోజులకు ఒకసారి కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే వారికి 15 శాతం పెనాల్టీతో అందించాల్సి ఉంది. కానీ అది ఎక్కడ కూడా అమలుకు నోచుకోవడం లేదని కూలీలు వాపోతున్నారు.

‘మంత్రి ‘పొన్నం’ క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న కాంబ్లే బాలాజీ

ఉట్నూర్‌రూరల్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య పదజాలంతో దుషించడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ అన్నారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పక్కనే ఉన్న సహచర మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ అంశాన్ని ఖండించకుండా సమర్థించడం సరికాదన్నారు. పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పకపోతే రేపటి నుంచి నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి దాసరి రాంప్రసాద్, అందారే బాలాజీ, తదితరులు ప పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ బండారి రాజు

నేరడిగొండ: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఇచ్చోడ సీఐ బండారి రాజు కోరారు. స్థానిక పోలీసు ఆవరణలో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మండల పరిధిలో 32 పంచాయతీలకు సంబంధించి 23,869 మంది ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పార్టీల నాయకులు పోలీసుకలు సహకరించాలన్నారు. రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా.. చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎస్సై ఇమ్రాన్, నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జిపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గావాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గావాయిపై రాకేశ్ కిషోర్ అనే న్యాయవాది సనాతన ధర్మం పేరుతో దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి మనువాద దాడులు దేశ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, న్యాయ వ్యవస్థపై భయానక దాడిగా పరిగణించాలన్నారు. రాకేశ్‌కిషోర్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మల్యాల స్వామి, మోతే బారికరావు, మల్యాల మనోజ్, నక్క రాందాస్, భీంరావ్ వాగ్మారే, లింగంపల్లి ప్రసన్న కుమార్, కత్తి గంగాధర్, తారరవికుమార్, నళిగంటి మహేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడి హేయమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విలాస్ ఒక ప్రకటనలో అన్నారు. రాకేశ్‌కుమార్ అనే న్యాయవాది సుప్రీం చీఫ్ జస్టిస్‌పై దాడి చేయడం దేశ వ్యాప్తంగా ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

బోథ్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదిలాబాద్ జిల్లా బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్ పాండే మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ దేశ ప్రజల న్యాయ హక్కులకు ప్రతీక అని, దానిని అందరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్, ఆడెపు హరీశ్, జమీర్ కేంద్రే, రాజు, గంగసాగర్ పాల్గొన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో బుధవారం కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. సంప్రదాయ పూజలు నిర్వహించి, భీం విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. జల్, జంగాల్, జమీన్ కోసం కోసం పోరాటం చేసి అసువులు బాసిన భీం ఆశయాలను కొనసాగించాలని కోరారు. నేటి యువత ఆదివాసీ హక్కుల కోసం భీం స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సార్‌మేడి పెందూర్ సుంగు, ఉప సార్‌మేడి ఆర్క సెడ్మరావు, కుమరం భీం కమిటీ అధ్యక్షుడు కుంరం గణపతి, నైతం మానిక్‌రావు, బైరి లచ్చన్న, సిడాం రాంపల్కు, ఆత్రం నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో తుల శ్రీనివాస్

బోథ్: సోనాల మండలంలోని మహదుగూడ, జైతుగూడ, కేశవ్‌గూడ గ్రామాల ప్రజలు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ ప్రభుత్వం గిరిజన గ్రామాలకు పంచాయతీ హోదా ఇచ్చిందని, మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేసిందని గుర్తుచేశారు. రైతుబంధు వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మోసపూరితంగా ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సంజయ్ రెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న సంజయ్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన ఎల్మా సంజయ్‌రెడ్డిను రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించినట్లు సంఘం నాయకులు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏనుగు సంతోష్ రెడ్డి, తిరుపతి రెడ్డిలు సంజయ్ రెడ్డికు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, క్యాతం శివప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల విరాళం



కంప్యూటర్లు అందజేస్తున్న సునీల్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు హైదరాబాద్‌కు చెందిన సునీల్ కార్పొరేట్ ఉద్యోగి నాలుగు కంప్యూటర్‌లను బుధవారం విరాళంగా అందించారు. గిరిజన విద్యార్థులకు చేసిన చేసిన సాయం మరువలేనిదని కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిప్రసాద్, కామర్స్ అధ్యాపకులు రాజశేఖర్, సుధాకర్, దేవన్న, పూర్ణచందర్, రాయలింగు పాల్గొన్నారు.

ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలి

తానూరు: మండలంలోని గ్రామాల్లో ఉపాధి కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని ఈజీఎస్ ఏపీవో శివలింగం సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇతర గ్రామాలకు వెళ్లిన వారికి సమాచారం అందించి వారికి కేవైసీ పూర్తి చేయాలని సూచించారు.

నగదు వెంట తీసుకెళ్లొద్దు

తానూరు: స్థానికసంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లొద్దని ఎస్సై షేక్ జుబేర్ అన్నారు. బుధవారం మండలంలోని ఉమ్రి (కే) గ్రామంలో ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంటలను అమ్మి డబ్బులు తీసుకొచ్చే రైతులు రశీదులను వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రలోభాలకు గురి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



టీకాలు వేస్తున్న సిబ్బంది

భీంపూర్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం ఉండవచ్చని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పోషకాహార దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రోహిదాస్, మేఘ, సరస్వతి, లచ్చుబాయ్, విజయలక్ష్మి, సుజాత, భాగ్యవతి, జానాబాయ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కాండ్లీ గ్రామంలో కాంగ్రెస్ నుంచి జాదవ్ సుభాష్, జాదవ్ వైష్ణవిలతో పాటు కాండ్లి, మోహద గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ తు ల శ్రీనివాస్, సాయిచైతన్య, తిరుమల్‌గౌడ్, కానిందే రాజారాం, చిల్కూరి భూమన్న, పర్చ సాయన్న, క వీందర్, లక్ష్మణ్, విద్యాసాగర్, రమణ, మారుతి, న ర్సు, చందర్, తరుణ్, యోగేష్, అరుణ్ పాల్గొన్నా రు.

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం పరామర్శించారు. వైస్ ఎంపీపీ ముచ్చ రఘు నానమ్మ వయోభారంతో గత నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

తలమడుగు: ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని పల్సి(బి)తండాలో స్వర్గీయ సద్గురు నారాయణ బాబా 19వ పుణ్యతిథి నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మిక వైపు నడవాలన్నారు. కార్యక్రమంలో కిషన్, వెంకటేశ్, కేదరేశ్వర్ రెడ్డి, అభిరామ్‌రెడ్డి, మెట్టి కిరణ్ కుమార్, అబ్దుల్లా, కిషన్, వామన్, ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కృషి చేయాలని ఇంద్రవెల్లి బీజేపీ నాయకులు, రైతులు ఎంపీ గోడం నగేశ్‌కు విన్నవించారు. బుధవారం ఎంపీ క్యాంప్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని ఆశతో మొక్కజొన్న సాగు చేశారన్నారు. ప్రస్తుతం సాగు చేసిన మొక్కజొన్న చేతికివచ్చిందన్నారు. వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ, కో కన్వీనర్ ఆరెల్లి రాజలింగు, ఆర్క ఖమ్ము, హెరేకుమ్ర అనిల్ కుమార్, దిలీప్ మోరే, కనక హనుమంత్‌రావ్, భీంరావ్, కోవ రాజేశ్వర్, జైస్వాల్ శివకుమార్, మెస్రం తుకారం, రాజువర్ధన్, సాయి ముండే పాల్గొన్నారు.

అన్నివర్గాల వారికి ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న ఆడే గజేందర్

బోథ్: అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ అన్నారు. బుధవారం సోనాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. గత పదేళ్లుగా పాలకులు అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఎన్నికల్లో అందరూ ఏకతాటిపై పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రజా పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడాల శేఖర్, ఇత్తేపు రమణ, చెట్లపెల్లి అశోక్, ఈర్ల సుధాకర్, పెద్ద కుర్మే శంకర్, నారాయణ, సోయం బాపూరావు, ఆరే చందు, రాజేశ్వర్, మద్దెల మహేశ్, చందర్, వసంత్ పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలు కాపాడాలి



పదసంచాలన్‌లో కార్యకర్తలు

ఖానాపూర్: హిందూ సమాజాన్ని సంఘటితం చేసి హిందూ సంస్కృతి, సంప్రదాయాలను రక్షించడమే ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశమని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజులవార్ దిగంబర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌ఎస్‌ఎస్ పథసంచాలన్ నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. దేశంలోని హిందువులను ఏకం చేసి మతం, ప్రాంతం అనే బేధాలను తొలగించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎవరికి వ్యతిరేకం కాదని ఆపత్కాలం, విపత్తుల వేళ స్వయం సేవకులు మానవత్వంతో పనిచేస్తారని పేర్కొన్నారు. అంతకముందు పట్టణంలోని వీధుల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పథసంచాలన్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ నూకల విజయ్, విశ్రాంత ఉద్యోగి ఎనుగు అశోక్ రెడ్డి, జిల్లా ధర్మ సంయోజక ప్రముఖ్ పడాల ప్రభాకర్, ఖానాపూర్ ఖండ కార్యవాహ తుమ్మనపెల్లి సంకేత్‌వర్ధన్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు జితేందర్, సమిరాజ్, శ్రీచక్ర, విఘ్నేశ్, రాజేశ్వర్‌గౌడ్, సాయి తదితరులున్నారు.

ఆరు గ్యారంటీలపై నిలదీయండి



కుంటాలలో బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుంటాల: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై నిలదీయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పేర్కొన్నారు. బుధవారం కుంటాలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో కాంగ్రెస్ చేసిన బాకీల కార్డులను ఇంటింటా పంపిణీ చేసి మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ముధోల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ముధోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ పడకంటి రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని తరోడా గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ నెరవేర్చని హామీలను వివరించే బాకీ కార్డులను ఆవిష్కరించారు. బండారి గంగాధర్, అశోక్, గణపతిజాదవ్, భూమారెడ్డి, గంగారెడ్డి, విఠల్, సాయి తదితరులు ఉన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన మామిడి పపేశ్వర్ తల్లి గంగవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను బుధవారం ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చెర్మన్ లోలం శ్యాంసుందర్ పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు శ్యాంసుందర్, అనిల్, ప్రకాశ్, దిగంబర్, ప్రశాంత్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899